

కథా కౌముది

# కుల్వాడే

ఎస్.నాగేశ్వరరావు

"యార్ ! ఆజ్‌కల్ తూ బహుత్ ఘూమ్ రహే హో ! యాద్ రఖో యే తో బహుత్ ఖతర్నాక్ శహర్ హై !"

ఎదురుగా కుల్వాడే నిలబడి ఉన్నాడు. అది వార్నింగో హెచ్చరికో అర్థం కాలేదు. కొద్దిగా భయమనిపించింది.

కుల్వాడే అంటే హిందీలో గొడ్డలి అని అర్థమట. ఎల్.ఎన్.కుల్వాడే అంటే లక్ష్మీనారాయణ్ కుల్వాడే పొడుస్తానికి సిద్ధంగా ఉన్న ఆంబోతులాగా ఉంటాడు. మాట కూడా గొడ్డలితో నరికినట్లే ఉంటుంది. చెయ్యెత్తు మనిషి. మనిషిని చూస్తుంటే కాసేపట్లోనో కూసేపట్లోనో తగదా పెట్టుకుని తన్నేవాడిలాగా కనిపిస్తాడు. కానీ చాలా మంచివాడు. రూపానికి గుణానికి సంబంధం లేదని రుజువు చేయాలనుకుంటే అతడొక మంచి ఉదాహరణగా పనికివస్తాడు. తను మధ్యప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో గుమస్తా. జబల్పూర్ దగ్గరలో ఏదో పల్లెటూరు. వాళ్ళ ఊరి దగ్గరలోనే నర్మదా నది ప్రవహిస్తుంది . వాళ్ళ నాన్న పాతికెకరాల మోతుబరి. నీటి వసతిఉన్న పొలమే వారిది. తనొక్కడే కొడుకైనా, తండ్రికి వ్యవసాయంలో తోడు ఉండాలనుకోలేదు. తను చదివిన చదువుతో ఆర్ టీ సీ లో ఉద్యోగం సంపాదించుకొని జబల్పూర్‌లో కాపురముంటున్నాడు.

మనవైపు పాతికెకరాలంటే పెద్దవ్యవసాయం క్రిందే లెక్క. మరి మధ్యప్రదేశ్‌లో కాదనుకుంటా. కుల్వాడే తల్లితండ్రులను నేను చాలాసార్లు చూసాను. ఏమంత గొప్పగా కనిపించేవారు కాదు. చాలా సీదా సాదాగా ఉండేవారు. తల్లి వంటిమీద వెండి తప్ప బంగారం ఉన్న సూచనలేమీ ఉండేవి కావు. తండ్రి రాంనారాయణ్‌కు

కొడుకు దూరంగా రావటం ఇష్టం లేదు. ఆ కోపాన్ని నా దగ్గర చాలాసార్లు వ్యక్తపరిచాడు. అయితే తల్లికి కొడుకు 'చాలా' పెద్దఉద్యోగంలో ఉన్నాడని గొప్పప్రేమ.

కుల్వాడే నాకంటే పెద్దవాడు. అతని భార్య సుమారుగా నాతోటిది. పెద్దవాడైన కుల్వాడే నన్ను అన్నా అనే పిలిచేవాడు. నా తోటిది అయిన కుల్వాడే భార్య సీత కూడా నన్ను అన్నా అనే పిలిచేది. భయ్యాకు తెలుగులో సమానర్ధకం అన్నా కదా!

వారంలో ఒకరోజు అంటే దాదాపుగా ప్రతి ఆదివారం కుల్వాడే ఇంట్లోనే నాకు భోజనం. హోటల్ భోజనం మీద బ్రతికే నాబోటివాడికి ఆ భోజనం అమృతప్రాయంగా ఉండేది. అప్పుడప్పుడు వారంలో మరో రోజు కూడా కుల్వాడే ఇంట్లో ఉభయం దొరికేది. అది బోనస్ అన్నమాట. ఇంటినుండి వెయ్యి కిలోమీటర్ల దూరంలో బ్రతికే నాకు కుల్వాడే పెద్ద అండ.

అలాటి కుల్వాడే నన్ను హెచ్చరించగానే సహజంగానే భయమేస్తుంది.

"అన్నా! క్యోం దరారహే హో! ఎందుకు భయపెడుతున్నావు"

"నీ గురించి పటేల్ నాకన్నీ చెప్పాడు."

శివ్‌భక్త పటేల్ నేనుండే బాడా (ఇంటి సముదాయం) లోనే ఒక రూంలో ఉంటాడు. లా చదువుతున్నాడు. లా లో నాకు క్లాస్‌మేట్.

"నాగురించి చెప్పేంతగా నేనేమి చేసాను భయ్యా ! " అనుమానంగానే అడిగాను.

"కబుర్లొద్దు. నువ్వూ రేఖా కలసి తిరుగటం లేదూ ! మొన్న మీరిద్దరూ కలసి సినిమాకు వెళ్ళారా లేదా ?" కుల్వాడే కోపంగా అడిగాడు.

" అన్నా! అదంతా ఉట్టిదే. సినిమాకు నేనెళ్ళిన మాట వాస్తవం . తను వచ్చిన మాట కూడా వాస్తవం. అయితే రేఖ వచ్చింది వాళ్ళ అక్కా బావతో, అంతే కానీ మేమిద్దరం కలసి మాత్రం కాదు"

మళ్ళీ నేనే చెప్పాను " పటేల్ పొరపాటు పడి ఉంటాడు. కావాలంటే మేమిద్దరం కలసి కూర్చున్నామో విడివిడిగా కూర్చున్నామో కనుక్కో విషయం తెలిసి పోతుంది"

మొత్తం మీద కుల్వాడే శాంతించాడు. అయినా పూర్తిగా నమ్మినట్లుగా లేదు.

"మరి మొన్న టెంపోలో వెళ్ళిన సంగతి"

"ఏడిచినట్లుంది. జబల్పూర్‌లో సిటీబస్‌లున్నవా ? ఉన్నవి ఒకటి రెండు. అవి ఎప్పుడు వస్తవో ఎవరికి తెలుసు. మరి యూనివర్సిటీకి వెళ్ళాలంటే టెంపోలేగా దిక్కు. ఇద్దరం ఇక్కడినుండే బయలుదేరి యూనివర్సిటీకి వెళ్ళాలి. మరి ఒకే టెంపో కాక వేరే వేరే ఎలా ఎక్కుతాము చెప్పన్నా ?"

"అంతేనంటావా !" అన్న శాంతించాడు.

"అంతే భయ్యా! అంతే! నాకంత సీను లేదు. చాలా మామూలువాణ్ణి, నన్ను చూసి రేఖ పరుగెత్తుకొస్తుందని అనుకోకు"

కుల్వాడే పూర్తిగా తగ్గిపోయాడు.

"సరేగానీ పటేల్ నీదాకా ఎందుకీ విషయం మోసుకొచ్చాడంటావ్?" కుల్వాడేను అడిగాను

"ఏమో ? రేఖమీద ఇంట్రస్టు ఉందేమో? "

పటేల్ చాలా గుంభన మనిషి. ఏదీ బయటకు తేలడు. ఎవ్వరితోనైనా నవ్వుతూ మాట్లాడుతాడు, చొరవ తీసుకుని పలుకరిస్తాడు. కాని అతని అంతరంగం మాత్రం ఎవరూ కనిపెట్టలేరు. అలాటివాడు కావాలని పితూరి చెప్పాడంటే ఏదో కారణముండే ఉంటుంది. లేకపోతే పటేల్ లాటివాడు బయటపడడు.

శివభక్తపటేల్‌ది ఇటార్సీ అలహాబాద్ రూట్లో ఉన్న సాత్నా. ఒక మోస్తరు బస్తీ. వాళ్ళనాన్న సిమెంటుఫాక్టరీలోనో మరేదో ఫాక్టరీలోనో ఉద్యోగి. ఎగువ మధ్యతరగతికి చెందిన వ్యక్తి. చూస్తానికి బాగుంటాడు. కానీ మనిషి కాస్త పొట్టి. మరీ కాదు. పొట్టివాడు గట్టివాడనే సామెతను ఋజువు చేయటానికి పటేల్ మంచి ఉదాహరణ. మాంచి లౌక్యుడు. ఎవరితో ఎలా ఉండాలో తెలుసు. తనకు కావల్సిన వివరాలు మన దగ్గర్నుంచి అలవోకగా సంపాదిస్తాడు, కానీ తన విషయాలేమీ ఆవగింజంత కూడా బయటకు తేలడు. తంపులు పెట్టే రకం

కాదని నా నమ్మకం. పటేల్ నాకు హితకారిణీ లా కాలేజీలో క్లాస్‌మేట్. నేను లాయర్‌గా రాణిస్తానో లేదో గారంటీ లేదు కానీ పటేల్ మాత్రం మంచి సక్సెస్‌ఫుల్ లాయర్ అవటము మాత్రం ఖాయం.

అసలు నన్ను అనుమానిస్తానికి కారణం ఉంది.

అసలు మొదట్లో నేను జబల్పూర్ యూనివర్సిటీలో చేరటానికి వచ్చినపుడు హాస్టల్‌లోనే చేరాను. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదిలో అలక్ష్యం కాస్త ఎక్కువే అని చెప్పాలి. గదులు మేమే తుడుచుకోవాలి. నా ఖర్మకాలి నాకు దొరికిన రూంమేటు బీహార్‌లోని దుంకా నుండి వచ్చాడు. మడ్డివెధవ. స్నానం చేయాలంటేనే వాడికి బద్ధకం. అలాటివాడు గదిని ఎందుకు శుభ్రం చేస్తాడు. ఎప్పుడైనా సరే నేను గది ఊడ్చుకోవాల్సిందే కానీ వాడు మాత్రం పొరపాటున కూడా చెయ్యి వేసేవాడు కాదు. రూమ్‌లే ఇలా తగలడితే మిగిలిన వాటి సంగతి ఊహించుకోండి. తిండి సమస్య ఇంకా ఇబ్బందిగా ఉండేది. అసలే ఉత్తరాది రొట్టెల భోజనమే కష్టమనుకుంటే ఈ హాస్టల్‌లో భోజనం ఘోరాతిఘోరం. హిందీవాళ్ళకే సహించేదికాదు. ఇంక మాకెలా ఉంటుంది. దాదాపు అర్ధాకలితోనే ప్రతిరోజూ జరిగిపోయేది. ఇంటి నుండి వచ్చిన మనీఆర్డర్ మొదటి పదిరోజులలోనే ఫినిష్. అయితే మా శక్తియుక్తులన్నీ ఉపయోగించి రకరకాల అబద్దాలు చెప్పి మరో మనీఆర్డరు తెప్పించుకోగలిగే వాళ్ళము. అది మాత్రం ఎన్నాళ్ళు సరిపోతుంది.మొత్తం మీద బీద బ్రతుకే.

హాస్టల్‌లో అడ్జస్టుకాలేకపోయేవాడిని. చదువు వద్దూ పాడూ వద్దు అని సామాను సర్దేసేవాడిని. కానీ అంతలో నా అంతరాత్మ భూనభోంతరాలు దద్దరిల్లేట్టు అరిచి నా పవిత్ర లక్ష్యాన్ని గుర్తు చేసి నా ఘర్‌వాపసీకీ బ్రేకు వేసేది. ఆగిపోయేవాడిని.

నేనేమీ జబల్‌పూర్ ఊరికినే రాలేదు. ఒక మహోన్నత లక్ష్యం సాధించటానికి వచ్చాను. నేను నా లక్ష్యం సాధించకుండా జబల్పూర్ యూనివర్సిటీ వదిలే ప్రసక్తే లేదు. సూర్యచంద్రులు గతులు తప్పవచ్చు గాక! ఋతువులు గమనాన్ని మార్చుకోవచ్చు గాక! కానీ నా లక్ష్యం మాత్రం నెరవేరకుండా ఏ శక్తి నన్నాపలేదూ ! ఆపలేదు.

నా లక్ష్యం నెరవేరాలంటే నా పోస్టుగ్రాడ్యుషన్ పూర్తి కావాలి. వీలైతే లా డిగ్రీ కూడా సంపాదించాలి. ఊరు దాటి బయటకు రావటానికి ఇష్టపడని నేను ఇంతదూరం రావటానికి కారణం అదే.

నేను శివానీను కాలేజీలో చూసి ఉండకపోతే ఈ కథ చెప్పాల్సిన అవసరం ఉండేది కాదు. డిగ్రీ మొదటి సంవత్సరం మొదట్లో, ఒకానొక చారిత్రాత్మకమైన రోజున ( అంటే నా వరకే, అందరికీ కాదు) నా కళ్ళ ముందు ఒక మెరుపు మెరిసింది. కాసేపు మైండు బ్లాంకయింది. తేరుకున్న తర్వాత, బ్లాంకైన మైండు తన్మయత్వంలోకి జారుకుంది. ఇన్ని సంవత్సరాలైనా ఆ తన్మయత్వం లోనే మునిగితేలితూనే ఉన్నది.

ఆ మెరుపే శివానీ.

శివానీ ఏ ప్రామాణికంగా చూసినా అప్సరసయే! ఎవర్నడిగినా ఆలోచించకుండా ఈ మాటే చెబుతారు. సరిపడా ఎత్తు, నాజూకైన సౌష్టవం, చక్కటికళ్ళు, కొనతేలిన నాసిక, పలుచటి పెదాలు, చిన్ననోరు. ఒక రూపసికి కావలిసిన లక్షణాలన్నీ సృష్టికర్త చే అనుగ్రహింపబడిన వరప్రసాది శివాని. నేనిష్టపడ్డానని పక్షపాతం తో చెప్పటం లేదు. ఎవరినడిగినా ఇదే సమాధానం వస్తుంది.

మరి అప్పటినుండి శివానీ నా ఆలోచనలలో ఒక భాగమయిపోయింది. నా కళ్ళముందు సదా తారాడే రూపమయిపోయింది. నిద్రలోనూ మెలుకువలోనూ అదే ఆలోచన.

ఊహ వేరు వాస్తవం వేరు. కల కనటం తేలిక. ఆచరణ కష్టం. నేనేరోజూ శివానీని పలుకరించే ధైర్యం చేయలేక పోయాను. తనూ అలాటి అవకాశం ఇవ్వలేదు.

అయితే నేనేమీ నిస్పృహ చెందలేదు. నాకు కావలిసింది శివానీ. అదేమీ అసాధ్యమయిన విషయమేమీ కాదు. పై చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించుకుంటే సరాసరి పెళ్ళికే ప్రయత్నంచవచ్చు.

అసలు ఊరుదాటటమంటేనే ఇష్టపడని నేను పీజీ కోసం వేరే రాష్ట్రంలో సీటు సంపాదించుకోవలసి వచ్చింది. తత్ఫలితమే జబల్పూర్ ప్రయాణం. యూనివర్సిటీలో పీజీ లో చేరాను. యూనివర్సిటీకి కాస్త దూరంగా హితకారిణీ లా కాలేజీ ఉంది. అందులో నైట్‌కాలేజీ సౌకర్యం కూడా ఉండేది. అందుకని లా లో కూడా చేరాను. నేను చదువులో ఎప్పుడూ మెరిట్ స్టూడెంట్‌నే. పీజీ, లా చాలా తేలిగ్గా పూర్తి చేయగలను. తరువాతి అంకం కూడా సులభంగానే దాటగలననే నమ్మకం ఉంది. పీజీ పూర్తిచేస్తే ఉద్యోగం అదే వస్తుంది. రాకపోయినా తెచ్చుకోగల పలుకుబడి కూడా ఉంది. ఒకసారి ఉద్యోగం అంటూ సంపాదిస్తే శివానీ తండ్రిగారిని ఒప్పించటం పెద్ద కష్టమేమీ కాదు. ఇదీ నా లక్ష్యం. నా జీవితగమ్యం.

మరి అలాటి మహోజ్వల లక్ష్యంతో జీవించే నేను గది బాగోలేదు, భోజనం బాగోలేదని వెన్ను చూపుతానా ? లేదే!

ఒకరోజు చిట్టిరాజు, దిలీప్‌లు బాంబు పేల్చారు. యూనివర్సిటీ హాస్టల్‌లో దాదాపు ఇరవైమంది తెలుగు కుర్రాళ్ళు ఉండేవారు. వాళ్ళలో వీళ్లిద్దరూ.

"ఒరే! మేం సిటీలోకి షిఫ్టయిపోతున్నాము. నువ్వు కూడా వచ్చేయి మాతో" చిట్టిరాజు చెప్పాడు.

"నేనూ మీతోనే . ఎక్కడ రూం తీసుకున్నారు"

"రూం కాదు. లాడ్జి. ఫోర్ బెడ్స్, ఫైవ్ బెడ్స్ ఉన్న డార్మెటరీ రూమ్‌లు" దిలీప్ విశదపర్చాడు.

వాడే మళ్ళీ చెప్పాడు " దగ్గర్లోనే హోటల్ మలబార్ ఉంది. సౌత్ భోజనం. నేను ఒకసారి చేసాను. చాలా బాగుంటుంది. ఈ రోటీలు తినలేక చస్తున్నాము. అందరం మారిపోదామని అనుకుంటున్నాము. నీవు కూడా వచ్చేయి మాతో"

నాకొక బలహీనత ఉంది. గుంపులో నిద్రపోలేను. గుంపులో చదువుకోలేను. మిగిలిన అన్ని విషయాల్లోనూ సంఘజీవినైనా, ఆ రెండింటి విషయంలో మాత్రం సర్దుకోలేను. అలా అని ఈ హాస్టల్‌లో ఉండాలనీ అనుకోలేదు. వీళ్ళందరూ వెళ్ళిపోయిన తర్వాత అసలు ఉండే ప్రసక్తే లేదు.

కలికానిక్కూడా మిగలకుండా అందరూ హాస్టల్‌నుండి జంప్. నేనొక్కడినే చివరకు మిగిలాను హాస్టల్‌లో. అసలే నా హిందీ పరిజ్ఞానం అంతంత మాత్రం. నా బీహారీ రూమ్మేటు హిందీ అసలు కొరుకుడు పడేది కాదు. మాట్లాడుదామంటే ఎవరూ ఉండేవారు కాదు. పగలు ఫర్వాలేదు. సాయంకాలం అయితే చాలు ఒంటరితనం. రెండుమూడురోజుల్లోనే పిచ్చెక్కిపోయింది. అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. మనవాళ్ళు ఉండే లాడ్జికి దగ్గరలో బయటెక్కడైనా గది వెతుక్కోవాలని అనేదే ఆ అలోచన.

కాలేజీ ఎగ్గొట్టి సిటీలో రూమ్ కోసం ప్రయత్నం చేసాను. రెండుమూడు రోజుల తర్వాత అదృష్టం కనికరించింది. చిట్టిరాజు వాళ్ళు ఉన్న లాడ్జీకి దగ్గరలో గంజిపురాలో రూం దొరికింది. మెయిన్‌రోడ్డు నుండి కాస్త లోపలకు వెళితే బలదేవ్‌సింగ్ బాడా ఉంటుంది. బాడా అంటే పేద్ద పాతకాలపు మిద్దె. నాలుగైదు భాగాలుగా చిత్రవిచిత్రంగా ఉంటుంది.మనవైపు అటువంటి ఇళ్ళు చూసిన దాఖ్ఖలా లేదు. మిద్దె కొంత, పెంకులతో కప్పిన

భాగం కొంత. తమాషాగా ఉంది. ఆ బాడాలో పదిపన్నెండు కాపురాలు. అంతా దిగువ మధ్యతరగతికి చెందినవారే. కొద్దిపాటి ఆదాయాలతో నెట్టుకొచ్చే కుటుంబాలవాళ్ళు.

బలదేవ్‌సింగ్ ఎప్పుడో కాలం చేసాడు. కానీ ఇల్లు మాత్రం ఆయన పేరుతోనే చలామణీ అవుతున్నది. పెద్దకొడుకు తారాచంద్ సాహూ. అతనే ప్రస్తుతం ఆ ఇంటి యజమాని. సన్నగా గోగుపుల్లలా ఉన్నాడు. మరి బలదేవ్ సింగ్ ఎలా ఉండేవాడో. పేరు మాత్రం గంభీరంగా ఉంది. మరి తండ్రి కూడా కొడుకు లాగా గోగూచేనా లేక ఏమైనా బలంగా ఉండేవాడా? ఏమో?

మొదట్లో తారాచంద్ నాకు గది ఇస్తానికి ఒప్పుకోలేదు. పరదేశీని కాబట్టి అద్దె ఎగ్గొట్టి పారిపోతానని అనుమానం. ఎలాగొలా ఒప్పించాను. వాళ్ళమ్మగారు కాస్త జాలి చూపించింది. తనే భరోసా ఇచ్చింది. ఆమెను అంతా బౌ అంటారు. బౌ అంటే జబల్పూర్‌లో తల్లిని పిలిచే పిలుపట. ఎందుకో తెలియదు కానీ బౌ అనాలంటే కుదిరేది కాదు. అసలు బౌ అనలంటేనే అదేదో గుర్తుకొచ్చేది. అందుకే నేను మాత్రం ఆమెని మాఁజీ అనే అనే పిలిచేవాడిని.

మిద్దె మీద ఒక చిన్న గది. చాలా చిన్నది. చాలా బీదగా ఉంది. నేను కలలో కూడా అలాటి గదిలో ఉండాల్సి వస్తుందని ఊహించలేదు. కానీ తప్పదు. ఊరి మధ్యలో ఉన్నది. స్నేహితులంతా దగ్గరలోనే ఉంటారు. మంచి భోజనం అందుబాటులో దొరుకుతుంది. అద్దె కూడా తక్కువే నలభైరూపాయలు. ఇదీ ఒక అనుభవమే.

స్నానానికి నీళ్ళు క్రింది బావిలో తోడుకోవాలి. మంచినీరు మాత్రం ఉదయం లేదా సాయంకాలం మునిసిపాలిటీవాళ్ళ పంపులో పట్టుకోవాలి. అది ఇంటి బయట ఉంటుంది.

మంచినీళ్ళ కోసం లుంగీ ఎగ్గట్టుకుని లైనులో నిలబడ్డాను. అంతా ఆడమళయాళం. నేనొక్కడినే మగపురుషుడను. బిక్కుబిక్కుమంటూ నిలుచున్నాను.

అప్పుడు వినపడింది సన్నగా ఒక స్వరం " అరే! నీవు యూనివర్సిటీలో చదువుతున్నావు కదూ?"

ఉలిక్కిపడి అటువైపు చూసాను. ఆ గొంతు ఓనరు నా ఈడు అమ్మాయి. మనిషి మాంచి పుష్టిగా ఉంది. మంచి ఎత్తు. కాస్త రంగు తక్కువైనా అందగత్తెలలోనే జమ. చూడగానే ఆకర్షించే కన్నుముక్కు తీరు.

"అవును" ఆ అమ్మాయిని ఎప్పుడూ చూసిన దాఖలా లేదు. సామాన్యంగా ఒక మోస్తరుగా ఉండే అమ్మాయిలనే మిస్ అవ్వము. మరి ఈమెను ఎలా మిస్ అయ్యానో తెలియదు.

అదే అన్నాను తనతో "మిమ్మలను ఎప్పుడూ చూడలేదండీ"

"నేనూ యూనివర్సిటీలోనే ఎంఏ చేస్తున్నాను. నాకు నువ్వు తెలుసు . మీ మద్రాసీలు చాలామంది ఉన్నారు. మా క్లాసు బిల్డింగ్ పక్కనే మీ క్లాసు కూడా"

నాలో ఉన్న తెలుగుజాతి పౌరుషం లేచి బుసకొట్టింది.

"మద్రాసీ కాదు. ఆంధ్రా ! ఆంధ్రా . తెలుగు. నో మద్రాసీ"

"సరేలే! ఇక్కడున్నావేమిటి?" నా పౌరుషహేలను పెద్దగా ఖాతరు చేయలేదు.

ఆడపిల్లలను దొంగచాటుగా చూసి ఉత్సాహపడటమే కానీ ఎదరపడి మాట్లాడేంత దమ్మున్న వీరుడ్ని కాను. అందుకే కొద్దిగా నోరు తడారి పోయింది. అయినా ధైర్యం చిక్కబట్టుకుని సమాధానం ఇస్తున్నాను. మిగిలిన ఆడపిల్లలు నీళ్ళు పట్టుకుంటూ చోద్యం చూస్తున్నారు.

" మరి నేను ఈ బాడాలోనే గది అద్దెకు తీసుకున్నాను" అని నేనున్న గదిని చూపించాను.

"నీ గది పైనే మా వాటా. మెట్లు అటువైపు ఉన్నవి"

ఆమె వివరాలు తెలుసుకుందామని మనసు ఉత్సాహపడింది కాని ధైర్యం చాలలేదు. అయినా నేను అడగకుండానే తన వివరాలు చెప్పుకొచ్చింది.

తన పేరు రేఖ! రేఖాతెలాంగ్. హిందీలో ఎంఏ మొదటిసంవత్సరం. తండ్రి మాధవరావు బల్వంతరావు తెలాంగ్. ఎప్పుడో వచ్చి సెటిల్ అయినా మరాఠీ కుటుంబం. మాధవరావు తెలాంగ్ పోస్టల్ డిపార్ట్మెంట్లో గుమాస్తా. బహుకుటింబీకుడు. రేఖా కాక ఇంక ఇద్దరు అక్కలు ఇద్దరు అన్నదమ్ములు. పెద్దక్కకు పెళ్ళి అయిపోయింది. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో ఉంటున్నది. అన్నయ్య డిఫెన్సులో పనిచేస్తాడు. రెండో అక్కకు పెళ్ళి కుదిరిపోయింది. అతిత్వరలో పెళ్ళి.

జబల్‌పూరేమీ పెద్దఫాస్టు సిటీ ఏమీకాదు. గట్టిగా చెప్పాలంటే కన్సర్వేటివే. ఇక్కడ కూడా ఆడపిల్లలు మగపిల్లలు మాట్లాడుకోవటం అబ్బురమే.

మొదట్లో రేఖను చూసి యమా ఫాస్ట్ అనుకున్నా. కానీ కాదు. ఒకరకంగా చెప్పాలంటే భోళామనిషి. మొదట్లో ఏర్పడిన అభిప్రాయం అతిత్వరలోనే మార్చుకోవాల్సివచ్చింది. అదికూడా పూర్తి వ్యతిరేకంగా.

రేఖకు చదువు అంటే చాలా ఇష్టం. చాలా కష్టపడి చదివేది. దాని వెనుక లక్ష్యం వేరు.

"రాజూ! నేనెప్పటికైనా మంచి ఉద్యోగం సంపాదిస్తాను చూడు. నా భవిష్యత్తు మాత్రం ఇప్పటిలా ఉండదు. నేను సాధిస్తాను చూస్తూండు "

"రాజూ ! పేదరికం గురించి నీకెంత తెలుసో తెలియదు కానీ అదెంత భయంకరమో నాకు చిన్నప్పటి నుండీ అనుభవమే. నేనేనాడు కొత్త బట్టలు కొనుక్కోలేదు. మా అక్కలు కొన్నాళ్ళు వాడిన తర్వాత నాకిచ్చేవారు. అవి తప్ప మంచివి, కొత్తవి నేనెరుగను. పుట్టిన దగ్గర్నుంచీ పేదరికము తప్ప మరోకటి తెలియదు. ఉదయం నాస్తా మాకు పెద్ద లగ్జరీ. నెలాఖరుకు అప్పుకెళ్ళకుండా ఉంటే ఆనెల మాకు పెద్ద పండుగ తెలుసా రాజూ నీకు"

ఇవన్నీ వింటుంటే నాకు దిగులు ముంచుకొచ్చింది. ఇలాటి కష్టాలు అనుభవించాల్సివస్తే నా పరిస్థితి ఏమిటి?

"రాజూ! కానీ నేనెప్పుడూ దిగులు పడలేదు తెలుసా ! పడీ ఉపయోగం ఏమిటి? అందుకే నన్ను నేను దిటవు పరుచుకోవటానికి ఒక లక్ష్యం పెట్టుకున్నాను. సర్కారీ నౌకరీ. అది గుర్తుకొస్తే చాలు నా భాధలన్నీ తొలగిపోతాయి. నాకు ఎక్కడలేని ధైర్యం వస్తుంది రాజూ! "

రేఖ ఎప్పుడు ఈ మాట చెప్పినా పూర్తి ఆత్మవిశ్వాసంతో చెప్పేది. నిజానికి రేఖతో పోలిస్తే నేను బలహీనుడనే !

"రాజూ! నాకు భగవంతుడు ఇచ్చిన పెద్ద వరం మా ఆయీబాబా (తలిదండ్రులు). అంత ప్రేమగాచూసుకునే తలితండ్రులు ఉండటమనేది ఏ జన్మ సుకృతమో! మాతోట్టువుల మధ్య ఈరోజుకూ చిన్న గొడవకూడా జరగలేదు తెలుసా?"

"మా పెద్దన్నయ్య తన జీతంలో తనకు కొద్దిగా ఉంచుకొని మిగిలినది మా నాన్నకు పంపుతాడు. అదే మాకు పెద్ద ఆధారం"

బలదేవ్‌సింగ్ బాడా నాకు జీవితానికి కావాల్సిన ఎన్నో పాఠాలు నేర్పింది. నావరకు నేను సిల్వర్ స్పూన్‌తోనే పుట్టాను. మొట్టమొదటి మనవడిని కావటం వలన చిన్నప్పటి నుండి గారంగా పెరిగాను. నాన్న వైపు తాత, అమ్మ వైపు తాత ఇద్దరూ మోతుబరులే. పేరున్నవారే. అష్టైశ్వ్యారాలలో పెరిగానని చెప్పను గానీ ఐశ్వర్యం లోనో పెరిగాను. గట్టిగా చెప్పాలంటే దేనికీ తడుముకోవాల్సిన అవసరం లేని జీవితం నాది. అప్పుడూ ఇప్పుడూ కూడా.

నా ఖర్మకాలి ఒకసారి గోపీచంద్‌ది 'అసమర్థుని జీవిత యాత్ర' చదివాను. అక్కడి నుండి బ్రతుకంటే భయం పట్టుకుంది. నేను కూడా ఆ నవలలోని ముఖ్యపాత్ర లాగా అయిపోతే నేను నెగ్గుకు రాగలనా ? ఈ భయం తరచూ నన్ను వెంటాడుతూనే ఉండేది. ఎప్పుడైనా కటిక పేదవాడిగా మారిపోతే ! ఎలా బ్రతకాలి? అసలు బ్రతకగలనా ?

బలదేవ్‌సింగ్ బాడాలో ఉన్నందంతా దిగువ మధ్యతరగతి వారే. అతితక్కువ ఆదాయంతో జీవితాల్ని గడిపేవారే. కానీ వాళ్ళెవరూ దిగులుతో బ్రతుకుతున్నట్లు నాకెప్పుడూ అనిపించలేదు. బహుశా కష్టాలకు అలవాటుపడిపోయి ఉండాలి. లేదా వాళ్ళ పరిధిలో వాళ్ళు సుఖంగా జీవిస్తూ ఉండి ఉండాలి. పేదరికం మూలంగా సౌకర్యాలు ఉండకపోవచ్చేమో కానీ తృప్తిగా బ్రతకటానికి, సుఖంగా బ్రతకటానికి మాత్రం అవరోధం కాదు. ఈ సత్యాన్ని బాడాలో జనాన్ని చూసే తెలుసుకున్నాను.

నెమ్మదిగా రేఖతో పరిచయం పెరిగింది. రేఖలాటి ఆడపిల్లతో మాట్లాడటం నాకొక థ్రిల్‌గా ఉండేది. అబద్దం చెప్పకూడదు కానీ రేఖతో మాట్లాడటానికి ఏదో అవకాశాన్ని నేనే వెతుక్కునేవాడిని.

సరిగ్గా ఇలాటి సమయంలోనే కుల్హాడే నాకు వార్నింగ్ ఇచ్చాడు. ఆ దెబ్బతో రేఖవైపు చూడాలంటేనే ధైర్యం చాలేది కాదు.

రేఖకు ఈ గొడవ ఏమీ తెలియదు. ఎక్కడ కనపడినా మామూలుగానే మాట్లాడేది. లోలోపల భయంగానే ఉన్నా నేనూ మామూలుగానే మాట్లాడేవాడిని.

రేఖకు ఇంకొక కోరిక కూడా ఉండేది. ఇంగ్లీష్ బాగా మాట్లాడాలని అదేమిటో అక్కడ ఎంత చదువున్నవారికి కూడా ఇంగ్లీష్ అంత బాగా వచ్చేది కాదు. నాకు హిందీ రాకపోవటం మూలంగా ఇంగ్లీషులో మాట్లాడటం తప్పనిసరి. మొక్కలేని చోట ఆముదం చెట్టు కూడా మహావృక్షమే. ఆ కారణంగా నేను కూడా అక్కడ ఇంగ్లీషులో పెద్ద పండితుడినే. ఈ కారణంగానే రేఖ నాతో మాట్లాడటానికి ప్రాముఖ్యత ఇచ్చేది. ఎందుకంటే నాతో అయితే తప్పనిసరిగా ఇంగ్లీషులోనే మాట్లాడాలి కనుక అలా మాట్లాడటం మూలంగా తన ఇంగ్లీషు వకాబలరీని (?) పెంచుకోవచ్చుగా.

రేఖతో మాట్లడటం ఎంత థ్రిల్లింగా ఉన్నా శివానీనే గుర్తుకు వస్తూండేది. ఎంత త్వరగా ఈ రెండేళ్ళు పూర్తయిపోతాయా ఎప్పుడు శివానీ వాళ్ళ నాన్నగారిని కలుసుకుంటామా అని ఆత్రంగానే ఉండేది. మధ్యమధ్యలో అప్పుడప్పుడూ భయంగా కూడా ఉండేది శివానీకి పెళ్ళి కుదిరిపోతుందేమోనని. అయితే నాకొక గూఢచారి 116 ఉండేవాడు విశ్వేశ్వరరావని. వాడికి శివాని వాళ్ళ నాన్నగారితో పరిచయం. ఎప్పటికప్పుడు ఉత్తరాలు వ్రాసుకుంటూ ఉండేవాళ్ళము. వాడి దగ్గర్నుంచి టెలిగ్రామో ఉత్తరమో రానంత వరకు దిగులు లేదు. భయంలేదు. నేను జబల్‌పూర్‌లో ఉన్నన్ని రోజులూ వాడి దగ్గర్నుంచి ఏ పిడుగూ పడలేదు.

నెలాఖర్లో ఒక రోజు యూనివర్సిటీ కాంటిన్‌లో గుమికూడాము. సామాన్యంగా తెలుగువాళ్ళమంతా గుంపుగానే తిరిగేవాళ్ళము. అందరి దగ్గరా కాపర్స్ అయిపోయినవి. మెస్, రూం బాపతు ముందరే చెల్లించేస్తాము కాబట్టి సమస్య లేదు. కానీ సిగిరెట్ల సంగతి. కాఫీ టీల సంగతి. సిగరెట్లు తాగకపోతే రోజు గడవదు కదా. కానీ అప్పటికే కుచేలుడి బ్రతుకులోకి వచ్చేసాము. అప్పు కావాలంటే కాంటిన్‌వాడిని బ్రతిమిలాడుకోవాలి. కాంటీన్‌వాడి భాష మాకర్థం కాదు. మా భాష వాడికి అర్థం కాదు. ఉన్నంతలో నల్లసాయిగాడే కాస్త మెరుగు.వాడికి కొద్దిగా హిందీ వచ్చు. నాక్కూడా వచ్చు కానీ వాడంత కాదు. అందుకే ఈ అడుక్కునే భాధ్యత వాడికి అప్పగించాము. మాటలరూపంలో అతి కొద్దిగా, ఆంగికాభినయం ద్వారా అతి ఎక్కువగా మొత్తం మీద ఎలాగోలా నల్లసాయిగాడు వాడిని ఒప్పించి సిగెరెట్లు, టీలు సంపాదించాడు. మేం మూకుమ్మడిగా ప్రమాణాలు చేసాము. మాలో ఎవరికి ముందు మనీఅర్డర్ వచ్చినా అందరి బాకీ చెల్లిస్తామని. వాడు నమ్మాడు. నమ్మక చస్తాడా !

అప్పుడే, సరిగ్గా ఒక్క సిగిరెట్‌నే నలుగురం పొదుపుగా తాగుతున్న సమయంలో రేఖ వచ్చింది.

పక్కకు పిలిచి " రాజూ ! నాకు నువు సహాయం చేయాలి" అని అడిగింది

నాకు గుండె జారిపోయింది. సామాన్యంగా ఎవరైనా ఏదైనా సహాయం అర్థిస్తే కాదనలేను. మరీ పెద్దమొత్తాలు ఇవ్వలేను కానీ వీలైనంత వరకు సహాయం చేస్తాను. కానీ ఇప్పుడున్న పరిస్థితులలో ఏమి సహాయం చేయగలను. రోజువారీ సాదరు ఖర్చులకే దిక్కులేదు ఇంక రేఖకు ఏమి సహాయం చేయగలను. పరిస్థితి వివరిస్తే నమ్ముతుందా ?

"చెప్పు"

"రాజూ ! మా అక్కయ్య పెళ్ళి దగ్గరకొస్తున్నది. తమ్ముడేమో చిన్నవాడైపోయాడు. అన్నయ్య పెళ్ళి సమయానికి మాత్రమే రాగలడు.  మానాన్న ఒక్కడే చేసుకోలేక పోతున్నాడు. కాస్త పెళ్ళిపనులలో ఏమైనా సహాయం చేసిపెడతావా?"

హమ్మయ్య ! డబ్బు ప్రసక్తి లేదు. గొప్ప రిలీఫ్!

" ఓ! దానిదేముంది. నీకేంకావాలంటే అది చేసిపెడతాను" అభయమిచ్చేసాను.

తర్వాత నిజంగానే పడీ పడీ చేసాను. వాళ్ళనాన్నను శలవు కూడా పెట్టనీయకుండా అన్నీ భుజాన వేసుకుని చేసాను. పెళ్ళిళ్ళంటే మనవైపు చాలా ఆర్భాటంగా చేస్తారు. అప్పుచేసైనా సరే చాలా ఘనంగా చేస్తారు. కానీ అక్కడ పెళ్ళిళ్ళు చాలా క్లుప్తంగా జరుపుతారు. ఎంత పెద్దపెళ్ళైనా సరే రెండు మూడు వందలమందికి మించి భోజనాలు పెట్టరు. రేఖవాళ్ళ అక్క పెళ్ళికి గట్టిగా లెక్కవేస్తే వచ్చిన అతిధులు వంద లోపే. ఆ మాత్రం కూడా వాళ్ళకు ఎక్కువే!

ఏదేమైనా రేఖకు ఏదో రకంగా సహాయంచేయటం సరదాగానే ఉన్నది. వాడకట్టులో కూడా నన్ను మంచివాడిగానే లెక్కకడుతున్నారు. ఎటుతిరిగీ పటేల్‌కు మాత్రం మంటగానే ఉన్నది. వాడి మాటల్లో చూపుల్లో వాడి బుద్ధి కనపడుతూనే ఉన్నది.

ఒకరోజు కుల్హాడే ఇంట్లో పేకాడుతున్నప్పుడు వాడి మంట బయటపడిపోయింది.

"కుల్హాడే ! ఈ మద్రాసీలు చాలా తెలివైనవాళ్ళు. మనం వాళ్ళను తట్టుకోలేము. ఏమాత్రం ఆదమరిచినా మనను ముంచేస్తారు"

నాకు ఒళ్ళు మండిపోయింది.

"పటేల్ పిచ్చిగా వాగకు. నా మీద కోపం ఉంటే నామీదే చూపు అంతేగానీ మొత్తం సౌత్‌ను తిడితే బాగోదు" ఎంతైనా పరదేశీని. వాడు లోకల్. అందుకని కాస్త తగ్గే సమాధానమిచ్చాను.

కానీ వాడు తగ్గలేదు. ఇద్దరి మధ్యా గొడవ పెరుగుతున్నది. కుల్వాడే అప్పుడు జోక్యం చేసుకున్నాడు.

ఎంతైనా కుల్వాడే పెద్దమనిషి. ధర్మంగా మాట్లాడాడు.

“పటేల్! నువ్వు అనవసరంగా మాట తూలుతున్నావు. నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడు”

కుల్వాడే పర్సనాలిటీ చూస్తే ఎవడికైనా భయమే. పటేల్ మహా లౌక్యుడు. స్పీడు తగ్గించాడు.

“పటేల్ అసలు నీ బాధ ఏమిటి ? నీకతనితో విరోధమెందుకు”

బయటపడటం పటేల్ రక్తంలోనే లేదు. అందుకే ఏమీ మాట్లాడలేదు.

కానీ నేనూరుకోలేదు.

“ అన్నా! పటేల్‌కు నా మీద కోపానికి కారణం నాకు తెలుసు. నేను రేఖతో మాట్లాడుతున్నాన్నది వాడి ఏడుపు”

“ఏం పటేల్! నిజమేనా?” కుల్వాడే పటేల్‌ను అడిగాడు. కానీ పటేల్ ఏమీ సమాధానమివ్వకుండా ముంగిలా కూర్చున్నాడు. కానీ నేనూరుకోలేదు.

“పటేల్! నీకు రేఖమీద ఇంట్రస్టు ఉంటే డైరెక్టుగా చెప్పేయి. అది సరి అయిన పద్దతి. నా మీద ఎగిరితే నీకేమీ లాభం ఉండదు. నాకేమీ రేఖ మీద ఇంట్రస్టు లేదు. నేనేమీ ఇక్కడ సెటిల్ కాబోవటం లేదు. ఇంకో ఏడాదికైనా నేను మాఊరు వెళ్ళిపోయేవాడినే”

“మరి అంత ఇంట్రెస్టులేనోడివి రేఖతో ఎందుకు తిరుగుతున్నావు”

“తిరుగుతున్నాననకు. మాట్లాడుతున్నానను. నేనెప్పుడూ రేఖను వెంటపెట్టుకుని ఎక్కడకూ వేళ్ళలేదు. కలసి వెళ్ళటం నీవెప్పుడైనా చూసావా?”

“చనువుగా మాట్లాడుతున్నావా లేదా? దానర్థంఏమిటి?” పటేల్ వెధవ లాజిక్ లాగాడు.

“నువు వెధవ లాజిక్‌లు లాగకు. ఆడపిల్లలతో ఎవరు మాట్లాడరు? చాన్సొస్తే నువ్వు మాట్లాడవా ? అలాగే నేను కూడా! ఆడపిల్లతో మాట్లాడుతూంటే థ్రిల్లింగా ఉంటుంది కాబట్టి నేను అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాను అంతే!”

మళ్ళీ నేనే చెప్పాను “పటేల్! నువ్వు నమ్మినా నమ్మకపోయినా రేఖతో ఒక్క మాట కూడా నీవు అనుకున్న విధంగా మాట్లాడలేదు. అసలు రేఖకూడా నేనంటే ఇష్టమున్నట్లు కూడా ఏనాడు చెప్పలేదు..”

పటేల్ కొద్దిగా శాంతించాడు.

“పటేల్! నా మీద నీది పైచేయి. నీవు ఇక్కడివాడివి. నాకంటే నీకే ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. అందుకే ధైర్యం చేసి కదిపి చూడు. అంతేకానీ నామీద పడి ఏడవమాకు”

కుల్హాడే అప్పటిదాకా శ్రోతలాగా మా మొహాల్ని చూస్తూ కూర్చున్నవాడల్లా సడెన్‌గా నోరు విప్పాడు.

“అవును పటేల్! నీవా బ్రాహ్మిన్‌వు కావు. వాళ్ళేమో మరాఠీ బ్రాహ్మణులు. నీకెలా ఇస్తారనుకుంటున్నావు. మరి మీనాన్న ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడా? వాళ్ళేమీ ఆస్థిపరులు కాదుగా” కుల్హాడే బ్రహ్మాండమైన పాయింట్ పట్టాడు. ఆ దెబ్బకు పటేల్ మొహం మాడిపోయింది. నీరసపడి పోయాడు.

నేను చెలరేగిపోయాను.

“పటేల్! ముందు ఆ సంగతి ఆలోచించు. తర్వాత ఏమి చెయ్యాలో చూద్దాం”

పటేల్ అంతదూరం ఆలోచించినట్లు లేదు. రేఖ మీద వ్యామోహమో ప్రేమో తప్ప లోతుగా ఆలోచించినట్లు లేదు. అందుకే జావకారి పోయాడు.

అంతటితో ఆరోజుకు సభ ముగిసింది.

కుల్వాడే కాక నాకు బాడాలో నాకు మరొక ఉభయదాత ఉన్నారు. బౌ. తారాచంద్ తల్లిగారు. అప్పుడప్పుడు నాకు నాస్తా టీ ఇచ్చేది. అందుకు కారణం నా మీద అభిమానమో జాలో లేక మరేదైనా కారణమో అప్పటికి నాకు తెలియదు. కానీ తరువాత తెలిసింది.

" బేటా! తూ క్యా జాత్ కా హో?" ఒకసారి బౌ నాగురించి, నా కులం గురించి ఆరా తీసింది.

ఎందుకు అడిగిందో నాకు అప్పుడు తెలియలేదు కానీ తర్వాతెప్పుడో కుల్వాడే చెప్పాడు.

"నిన్ను తారాచంద్ తల్లి ఎందుకు నాస్తాకు పిలుస్తుందో నీకు అర్థమవుతున్నదా?" కుల్వాడే నన్ను ప్రశ్నించాడు.

"తెలియదు" నా సమాధానం.

"సావిత్రిని నీకు చేయాలని వాళ్ళ ఉద్దేశ్యం. నీకు కాస్త ఆస్తిపాస్తులున్నవిగా అందుకని పరదేశీవైనా నీమీద ఆసక్తిగా ఉన్నారు. అయినా నీకు ఈ మాత్రం అర్థం కాలేదంటే పెద్ద బేకార్‌గాడిలా ఉన్నావే "

సావిత్రి తారాచంద్ ఆఖరి చెల్లెలు. తెల్లగా ఉంటుంది అయితే ఏమంత బాగోదు. జస్ట్ ఏవరేజ్. బెనారస్ మెట్రిక్ పాస్ అవటానికి గత నాలుగయిదు సంవత్సరాలుగా నిర్విరామంగా కృషి చేస్తూనే ఉన్నది. అయినా కాలం కలసి రావటం లేదు. పాపం చంటిది ఏమి చేయగలదు. అందుకే ప్రతిసంవత్సరమూ తప్పుతూనే ఉన్నది.

అయితే వ్యవహారం అంతకు మించి ముందుకు కదలలేదు. కాకపోతే కారణం తెలిసిన తర్వాత ఏడవటం నా వంతైంది.

నూనెగానుగ ఆడించే కులం వాళ్ళు క్షత్రియులెలా అయ్యారో, వ్యవసాయం కులవృత్తిగా ఉన్న నాకులం ఎలా తక్కువదైందో నాకర్థం కాలేదు. ఏదేమైనా మంచే జరిగింది. ఏ గోలా లేకుండా సంబంధం తప్పిపోయింది. అయినా మాఁజీ ఆదరణలో ఏమాత్రం మార్పు లేదు. ఎప్పటిలా మామూలుగానే ఉంది.

తేడా అల్లా ఆమధ్య కొన్నాళ్ళపాటు నన్ను చూసి సిగ్గుతో మెలికలు తిరిగిన సావిత్రి ప్రస్తుతం మెలికలు తిరగటం పూర్తిగా ఆపేసింది. తప్పిపోయిన పెళ్ళికొడుకును చూసి ఏ పెళ్ళికూతురు సిగ్గుపడుతుంది కనుక. అది లోకరీతి.

కాలం నెమ్మదిగానో వేగంగానో పరుగెత్తుతూనే ఉన్నది. అయితే నావరకు నెమ్మదిగా కాలం గడుస్తున్నదని అనిపిస్తుంది. ఎంత త్వరగా ఈ చదువు అయిపోతుందా, ఏదైనా ఉద్యోగం ఎంత త్వరగా సంపాదించాలా అన్నదే నాఆరాటం. లేకపోతే జీవితంలో అతి పెద్ద ఆశాభంగాన్ని ఎదుర్కోవాలి. మగవాళ్ళకు పెళ్ళికి అర్హత రావాలంటే వయసు వస్తే చాలదు. సంపాదన తప్పనిసరి. ఆడపిల్లలకు ఆ జంఝాటం లేదు. వయసు వస్తే చాలు. నాకు పెళ్ళి కావాలంటే ఉద్యోగం తప్పనిసరి. కానీ శివానీకి ఆ సమస్య లేదు. అందంగా ఉంటుంది, పైగా వాళ్ళ నాన్న మంచి కట్నం ఇవ్వగలడు. కాబట్టి మంచి సంబంధం వస్తే చాలు నిమిషాలలో పెళ్ళి జరిగిపోతుంది. అదే నా భయం కూడా.

మధ్యలో ఒకసారి హైదరాబాదు బ్యాంకు ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళి వచ్చాను. బాగానే చేసాను. ఆ ఉద్యోగం వస్తే బాగుండు. శివానీ నాన్నగార్ని ధైర్యంగా అడగవచ్చు. చాలా రోజుల తర్వాత దేవుడు గుర్తుకువచ్చాడు. నిజానికి మనకు సమస్యలెదురైనప్పుడే దేవుడు గుర్తుకొస్తాడు. ఉత్తప్పుడు దేవుడ్ని మనం అట్టే పట్టించుకోము. అయినా పాపం దేవుడు ఏమీ ఫీలవడు. మనకు చేయాల్సిన మంచి చేస్తూనే ఉంటాడు.

నెమ్మదిగా ఫైనల్ఇయర్ చివరకు వచ్చాము. పరీక్షలకోసం కష్టపడిచదివాను. పరీక్షలు బాగా వ్రాసాను. నేనింతవరకూ ఎప్పుడూ పరీక్షలలో తప్పలేదు. ఈ సారీ తప్పే ప్రసక్తి లేదు.

ఇంటి దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. బ్యాంకు ఉద్యోగంలో నెలాఖరులోగా చేరమని ఆర్డర్స్ వచ్చినవి. అన్నీ మంచి శకునములే కన్యాలాభ సూచనలే !

ఆఖరు పరీక్ష అయిన రోజు రాత్రే మా ప్రయాణం. ఆ రోజే ఆఖరి పరీక్ష. రేఖ తన పరీక్ష కూడా వ్రాసి మా హాలు దగ్గరకు వచ్చింది.

"రాజూ! నీతో మాట్లాడాలి. ఫర్వాలేదా!"

"చెప్పు"

"రాజూ ఇవాళేగా నీవు వెళ్ళిపోయేది"

అవునన్నాను.

"నాగురించి ఎప్పుడైనా ఆలోచించావా?" ఎందుకో రేఖ గొంతులో చిన్నమార్పు.

"దేని గురించి ?" నాకు తెలుసు ఎందుకు అడుగుతుందో.

"అంటే నీవెప్పుడూ నన్నిష్టపడలేదా?"

నాకు గిల్టీగా అనిపించింది. నా కొద్దిపాటి స్వార్ధంతో ఆ అమ్మాయిని మోసం చేసానేమోనని. నిజానికి నా థ్రిల్‌కోసం నేనే ఆ అమ్మాయితో మాటలూ, స్నేహం పెంచుకుంటూ వచ్చాను. అలాటి పరిస్థితులలో ఏ ఆడపిల్లైనా అలాగే ఊహించుకుంటుంది.

కానీ నాకు నేను ఆత్మవంచన చేసుకున్నాను. నేనెప్పుడూ ఆ పిల్లతో ఏరకమైన ప్రేమ సంభాషణా చేయలేదు. నేను చనువుగా మాట్లాడేనేగాని మరో రకంగా ఆశలు కల్పించలేదు. నా గమ్యం శివానీ అయినపుడు ఇక్కడ మరో కథ మొదలుపెట్టనుగా. కానీ నా లాజిక్‌ను నా అంతరాత్మే ఒప్పుకోవటం లేదు. నేను రేఖతో అవసరమయినదానికన్నా ఎక్కువే స్నేహం చేసాను. దానిని ఆమె మరో రకంగా అర్ధం చేసుకుంది. తన కుటుంబ పరిస్థితులు కూడా ఆమెమీద ప్రభావం చూపి ఉండవచ్చు. ఏదేమైనా ఇద్దరిదీ చిన్న వయసే. అనుభవం తక్కువ. పొరపాటు చేయటానికి , పడటానికి ఇద్దరికీ అవకాశం ఉంది. నేను రెండు పడవలమీద కాళ్ళు పెట్టి ఉండకపోవచ్చు కానీ ఒకటిన్నర పడవల మీద మాత్రం కాళ్ళు పెట్టాను. అది నిశ్చయం.

నేను బేసికల్‌గా సెన్సిటివ్‌ను. ఎదుటివారిని నొప్పించలేను. ఈ పరిస్థితి నాకై నేను కొని తెచ్చుకున్నదే! ఇలాటి పరిణామాన్ని ఊహించకపోవటము పూర్తిగా నా తెలివిమాలినతనమే. దీనిలోనుండి బయటపడక తప్పదు. అందుకు రేఖను నొప్పించకతప్పదు.

"రేఖా! నేను నీతో చనువుగా ఉన్న మాట వాస్తవం. అంతకు మించి నేనెప్పుడూ నీతొ ఆ కోణంలో మాట్లాడలేదు. ఎందుకంటే నిన్ను మోసం చేసే ఉద్దేశ్యం నాకెప్పుడూ లేదు. నాకు నా తలిదండ్రులను ఎదిరించే ధైర్యం లేదు. వాళ్ళను కాదని ఏ పనీ చేయలేను. ఒకవేళ నేను నిన్ను ఇష్టపడ్డా కూడా మా తల్లిదండ్రులు కాదంటే

నిన్ను పెళ్ళిచేసుకోలేను. ఆ సంగతి నాకు బాగా తెలుసు కాబట్టి నేను నీతో పరిధి దాటి ఎప్పుడూ ప్రవర్తించలేదు. ఒకవేళ నేను ఎప్పుడైనా అలాటి అభిప్రాయం కలిగించి ఉంటే నన్ను క్షమించు"

రేఖ హతాశురాలయింది. మొహంలో ఆశాభంగం కొట్టవచ్చినట్లు కనపడింది. కంట నీరుతిరుగుతూండగా నావంక కోపంగా చూసుకుంటూ వెళ్ళిపోయింది.

రాత్రి బయలుదేరేముందు అందరికీ వీడ్కోలు చెప్పాను. కానీ రేఖ నాకు కనిపించలేదు. నాకు తెలుసు నేను ఆమె దృష్టిలో ఒక ద్రోహినని. కానీ నేను చేయగలిగింది ఏమీలేదు.

మొత్తం ఇరవైమందిమీ ఒకేసారి ఒకే బండికి బయలుదేరాము. ఇటార్సీలో రైలు మారాలి. ఇటార్సీలో జీటీ ఎక్స్ ప్రెస్ ఎక్కాము. జీటీ అప్పట్లో చాలా వేగవంతమైన రైలు. కానీ నాకెందుకో అంత వేగంగా వెళుతున్నట్లనిపించలేదు. కళ్ళుమూసి తెరిచేప్పటికి మా ఊరిలో ఉండాలి. విశ్వేశ్వరరావును కలవాలి. కానీ రైలు అంతవేగంగా వెళ్ళలేదుగా! అదీ కారణం.

ఉదయానికి చేరుకున్నాము. ఇంటికి చేరగానే గబగబా స్నానం చేసి ఆత్రంగా విశ్వేశ్వరరావును కలిసాను. ఎందుకంటే ఇకముందు కథ నడిపించాల్సింది వాడే. నాకు ఉద్యోగం కూడా వచ్చిందని చెప్పి నా తరఫున శివానీ తండ్రిగారితో రాయబారం చేయాల్సింది వాడే !

నేను వెళ్ళేప్పటికి వాడు ఇంట్లోనే ఉన్నాడు. నన్ను చూడగానే వాడి మొహం చిన్నపోయింది. ముభావంగా అయిపోయాడు. ఏమంత ఉత్సాహంగా మాట్లాడలేదు. కారణం నాకర్థం కాలేదు.

అడగ్గా అడగ్గా, సమాధానం చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

"శివానీ పెళ్ళి కుదిరిపోయిందిరా! పైనెలలోనే పెళ్ళి"

సడెన్‌గా అగాథంలోకి తోసేసినట్లనిపించింది. ప్రపంచం తల్లక్రిందులైపోయిన భావన. ఊపిరి ఆగిపోయింది. ఒంటిలోనీ రక్తమంతా ఇంకిపోయింది.

ప్రపంచంలోనివారంతా నన్ను మోసం చేసారన్న భావన. ఈ ప్రపంచం ఇంతటితో అంతమైపోవాలన్న కసి. ఉక్రోషం, నిస్సహాయత, నిస్సత్తువ.

అసహాయుడ్ని. ఏమీ చేయలేని నిస్సహాయుడ్ని.

శక్తినంతా కూడదీసుకుని అడిగాను "మరి నాకు చెప్పలేదిమిరా?"

"చెబితే ఏమి చేసేవాడవు ? ఏం చేసేవాడవు ? చేయటానికి నీకేమైనా అవకాశముందా? అందుకే నీకు చెప్పలేదు. చెప్పి ఉంటే పరీక్షలు మానేసి వచ్చి ఉండేవాడివి. అంతకంటే మరేమీ జరిగేది కాదు. అందుకే చెప్పలేదు. శివానీ లేకపోయినా కనీసం నీకు పీజీ డిగ్రీ అయినా వచ్చింది సంతోషించు"

వాడు చెప్పింది కూడా నిజమే! వచ్చి ఏమి చేయగలిగి ఉండేవాడిని ?

తర్వాత కొన్నాళ్ళకు శివానీ పెళ్ళి జరిగిపోయింది.

వెళతారు వేళ్ళేటివాళ్ళు, చెప్పేసెయ్ తుది వీడుకోలు

ఉంటారు ఋణమున్నవాళ్ళు, వింటారు నీ గుండె రొదలు

మనకేది ప్రాప్తమో అదే మనకు దొరుకుతుంది. అంతకు మించి ఆశిస్తే ఆశాభంగమే. నాకర్థమైన జీవితసత్యం అదే ! అదొక్కటే!

Travellers on the Road of Life

Meet only to part

And parting leave behind memories

To torment the lonely times

ఉపసంహారం:

పన్నెండు సంవత్సరాల తర్వాత మళ్ళీ జబల్పూర్ వెళ్ళాను. మా తండ్రిగారి అస్థికలు కాశీలో గంగలో కలపటానికి వెళ్ళి తిరిగివస్తూ జబల్పూర్‌లో ఆగాను. నాకు బాగా అలవాటైన వైశాలీ లాడ్జిలో రూం తీసుకున్నాను. జబల్పూర్ ఈ పన్నెండు సంవత్సరాలలో ఏమీ మారలేదు. ప్రొద్దున్నే బలదేవ్‌సింగ్ బాడాకు వెళ్ళాను. అదీ అలానే

ఉంది. మార్పులేమీ లేవు. పెద్దావిడ కాలం చేసింది. తారాచంద్ ఆప్యాయంగా మాట్లాడాడు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా గుర్తు పెట్టుకుని వచ్చినందుకు చాలా సంతోషపడ్డాడు.. సావిత్రి పెళ్ళైపోయింది. కుల్వాడే ఇల్లు మారిపోయాడు. అతని ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ రాత్రి పొద్దుపోయే వరకూ అక్కడే ఉన్నాను..

కుల్వాడే రేఖగురించి చెప్పుకొచ్చాడు. పటేల్ పట్టుపట్టి రేఖను పెళ్ళి చేసుకున్నాడు. పేదరికం కారణంగా కానీ మరేదైనా కారణంగా కానీ రేఖ తల్లితండ్రులు కులాంతర వివాహానికి అడ్డుచెప్పలేదు. రేఖకు అనుకున్నట్లుగా ఏ ఉద్యోగమూ రాలేదు. కానీ పటేల్ చొరవతో తను కూడా లా చేసింది. ప్రస్తుతం ఇద్దరూ జబల్పూర్ హైకోర్టులోనే ప్రాక్టీస్ చేస్తున్నారు.

మర్నాడు శనివారం. కోర్టుకు శలవు. పటేల్ ఇంటికి వెళ్ళాను. భార్యాభర్తలు ఇద్దరూ ఉన్నారు. పటేల్ అభిమానంగా రిసీవ్ చేసుకున్నాడు. చిత్రంగా రేఖ కూడా! పటేల్‌లో మార్పేమీ లేదు కానీ రేఖ మాత్రం కాస్త సన్నబడింది. ఆర్థికంగా స్థిరపడ్డారు. ఇల్లు కట్టుకున్నారు. ప్రాక్టిస్ బాగుంది.

ఆ సాయంకాలం నాకు సెండాఫ్ చెప్పటానికి దంపతులిద్దరూ స్టేషన్‌కు వచ్చారు. కుల్వాడే కూడా!

బండి కదులుతున్నప్పుడు తుది వీడ్కోలుగా చేతులూపాను. మళ్ళీ వీళ్ళను ఎప్పుడైనా కలుసుకుంటానో లేదో!

పన్నెండు సంవత్సరాల క్రితం ఇదే జబల్పూర్ స్టేషన్ నుండి ఎన్నో ఆశలతో స్వంత ఊరికి బయలుదేరాను. చివరకు నిరాశే మిగిలింది. గతం గుర్తుకువచ్చింది. సన్నటి నీటిపొర నా కళ్ళను కప్పేసింది. అంతా మసకగా కనిపించింది. ఎక్కడో గుండెలోతుల్లో చిన్న బాధ, రవ్వంత దిగులు, కొద్దిపాటి అసూయ. నేను కోరుకున్న శివానీ నాకు దక్కలేదు. పటేల్ కోరుకున్న రేఖ పటేల్‌కు దక్కింది. నాకు లేని అదృష్టం పటేల్‌కు ఉంది. నేను చేయలేని పని పటేల్ చేసాడు. నేను ఊహల్లో బ్రతికాను పటేల్ వాస్తవంలో బ్రతికాడు.

ఎందుకో గోపీచంద్ నవల 'అసమర్థుడి జీవిత యాత్ర' గుర్తుకువచ్చింది. బహుశా నేనూ అసమర్థుడినేమో! ఏమో!

COMMENTS